




హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై లాఠీలతో విరుచుకుపడుతున్న పోలీసులు, ఓ విద్యార్థిని అమాంతం లాక్కెళ్తున్న పోలీసులు, కాలు, చేతికి తగిలిన పోలీసుల లాఠీదెబ్బలను చూపుతున్న హెచ్‌సీయూ విద్యార్థి

## హెచ్‌సీయూ విధ్వంసంపై నివేదిక ఇవ్వండి

**రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పర్యావరణ శాఖ లేఖ**

- **పర్యావరణ నిబంధనలు పాటించాలని ఆదేశం**
- **హెచ్‌సీయూ భూముల వేలంపై ఎన్జీటీలో న్యాయవాది కారుపోతుల రేవంత్ ఫిర్యాదు**

హైదరాబాద్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): కంచ గచ్చిబౌలి భూముల్లో భారీగా వృక్ష సంపద, వన్యప్రాణులకు జరుగుతున్న నష్టంపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఈ మేరకు ఆ శాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్. సుందర్ బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ అదనపు కార్యదర్శికి లేఖ రాశారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో అక్రమంగా చెట్లను తొలగించి వృక్ష సంపదను ధ్వంసం చేసినట్టు తమకు సమాచారం అందిందని ఆ లేఖలో పేర్కొన్నారు. చెరువులు, వన్యప్రాణులు, ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన రాతి నిర్మాణాలకు నష్టం జరుగుతున్నట్టు మీడియాలో వార్తలు వచ్చినట్టు చెప్పారు. దీనిపై ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రిని కలిసి వినతి పత్రాలు కూడా సమర్పించారని తెలిపారు. ఈ నేపథ్యంలో దీనిపై వెంటనే వాస్తవ నివేదికను సమర్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పర్యావరణ నిబంధనలు, చట్టాలు, కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించరాదని, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో స్పష్టంచేశారు.

**ఎన్జీటీని ఆశ్రయించిన న్యాయవాది**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో న్యాయవాది కారుపోతుల రేవంత్ బుధవారం ఫిర్యాదు చేశారు. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి పునరాలోచన చేయడం లేదని, అందుకే చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు. హెచ్‌సీయూ భూముల వేలం అనైతికమని, వెంటనే ఈ ప్రక్రియను అడ్డుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలని ఫిర్యాదులో కోరినట్టు వెల్లడించారు. పారిశ్రామిక అభివృద్ధి పేరిట పచ్చని చెట్లు, వివిధ రకాల జీవరాశులతో చక్కటి వైవిధ్యం కలిగిన భూముల్లో ప్రభుత్వమే చెట్లను నరికి వేయడం అవివేకమైన చర్య అని పేర్కొన్నారు. ఈ 400 ఎకరాల భూమి హైదరాబాద్‌కు కొంతమేర కాలుష్యం నుంచి ఉపశమనం కలిగిస్తున్నదని తెలిపారు. ఇలాంటి పర్యావరణ ప్రాంతాలను ధ్వంసం చేయడం మంచిది కాదని ప్రభుత్వానికి హితవు పలికారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో న్యాయపరంగా కొట్లాడతామని, ఈ అంశంలో న్యాయంజరిగే వరకు పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు.

# హెచ్‌సీయూలో సర్కారీ గూండాగిరీ!

మొదటిపేజీ తరువాయి...

నిలిపివేయాలని, జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళన బుధవారం మరింత ఉద్ధృతమైంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో అధ్యాపకులు కూడా గొంతు కలిపారు. వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేసేందుకు ప్రభుత్వం చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయడంతోపాటు విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలంటూ హెచ్‌సీయూ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ఈస్ట్ క్యాంపస్ మీదుగా వర్సిటీ ప్రధాన ద్వారం వరకు, ప్రధాన ద్వారం నుంచి అడ్మినిస్ట్రేషన్ భవనం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. 'పోలీస్ గో బ్యాక్', 'ప్రభుత్వం వెంటనే యూనివర్సిటీ స్థలాన్ని వీడాలి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆడిటోరియం నుంచి ప్రారంభమైన ర్యాలీ.. క్యాంపస్ మెయిన్ గేటు, అడ్మినిస్ట్రేషన్ భవనం మీదుగా ఈస్ట్ క్యాంపస్ వైపు శాంతియుతంగా వెళ్తుండగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు. దొరికిన విద్యార్థులను దొరికినట్టుగా చితకబాదారు. దీంతో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థుల వెన్నుపై, కాళ్లపై లాఠీ వాతలు పడ్డాయి. దీంతో ఆగ్రహించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు.. పోలీస్ జులుం నశించాలంటూ రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. యూనివర్సిటీ భూములను దోచుకొనేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాంటి పరిస్థితులను తీసుకొచ్చారని మండిపడ్డారు. వెంటనే పోలీసులు, బుల్డోజర్లు క్యాంపస్ నుంచి బయటకు వెళ్లిపోవాలని, క్యాంపస్ భూములను యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు.

**అర్ధరాత్రి వరకు కొనసాగిన ఆందోళన**

హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, వర్సిటీ యాజమాన్యం మాత్రం మౌనంగా ఉంటూ, ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నదని ఆరోపిస్తూ విద్యార్థులు అర్ధరాత్రి వరకు అడ్మినిస్ట్రేషన్ భవనం ముందు ఆందోళన చేపట్టారు. భూముల పరిరక్షణ కోసం తమతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో పోరాటం చేయాలని కోరుతూ అందజేసిన మెమొరాండంపై వర్సిటీ యాజమాన్యం మౌనంగా ఉండటంతో అక్కడే బైఠాయించారు. యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ ఆందోళన కొనసాగించారు. వర్సిటీ భూములను తిరిగి అప్పగించి, యూనివర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేసేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. విద్యార్థులు లాఠీదెబ్బలు తింటున్నా యాజమాన్యానికి కనిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న తమ ఆందోళనకు యాజమాన్యం కూడా మద్దతు తెలపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.




**డీసీపీ పర్యవేక్షణ**

ఇదిలా ఉండగా మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మాదాపూర్ డీసీపీ వినీత్ హెచ్‌సీయూకు చేరుకున్నారు. అక్కడ నెలకొన్న పరిస్థితుల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన గేటు వద్ద నుంచే పరిస్థితిని సమీక్షించిన డీసీపీ, పోలీసులు ఎక్కడా లాఠీచార్జి చేయలేదని, కేవలం గుంపును చెదరగొట్టేందుకు యత్నించినట్టు చెప్పారు.

**డ్రోన్ ఎగురవేసిన ముగ్గురిపై కేసులు**

ఆందోళనలతో అట్టుడుకుతున్న హెచ్‌సీయూలో డ్రోన్‌లు ఎగురవేసిన ముగ్గురు వ్యక్తులపై గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదుచేశారు. మణికొండ ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరుణ్‌కుమార్ (33) మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో టీఎన్జీవో కాలనీ వద్ద నుంచి దానికి ఆనుకుని ఉన్న హెచ్‌సీయూ క్యాంపస్‌పై డ్రోన్ కెమెరాను ఎగురవేశాడు. జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన సివిల్ ఇంజినీర్ సాయివిజయ్‌రెడ్డి మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో, బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన రోహన్ నాగిరెడ్డి మంగళవారం రాత్రి సమయంలో హెచ్‌సీయూపై డ్రోన్‌లు ఎగురవేయడంతో ఈ ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వీరికి నోటీసులు ఇచ్చి పంపించివేసినట్టు పేర్కొన్నారు.

**కోర్టు ఆర్డర్స్‌తో ఆగిన పనులు**

హెచ్‌సీయూలోని ఈస్ట్ క్యాంపస్ వైపు ఉన్న 400 ఎకరాల చదును చేసే పనుల్లో ప్రభుత్వం ఒంటెద్దు పోకడ ప్రదర్శించింది. హైకోర్టుకు పండుగ సెలవులను అసరాగా చేసుకుని వందల సంఖ్యలో బుల్డోజర్లను దింపి రాత్రి, పగలు అని తేడా లేకుండా జీవ వైవిధ్యాన్ని నాశనం చేసింది. వన్యప్రాణుల ఆరణ్య రోదనలను పట్టించుకోకుండా ఫ్లడ్‌లైట్లను పెట్టుకొని మరీ భూములను చదును చేసింది. భూములు తమ వేనని చెప్తున్న ప్రభుత్వం, 400 జేసీబీలతో రాత్రింబవళ్లు పనులు చేయించింది. ఈ నేపథ్యంలో పనులు నిలిపివేయాలంటూ బుధవారం హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రభుత్వం దిగొచ్చింది. తొలుత న్యాయస్థానం ఆర్డర్ కాపీ తమకు చేరలేదంటూ రాత్రి వరకు పనులు కొనసాగించింది. చివరకు పనులు నిలిపివేసింది. దాదాపు 80% మేర పనులు జరిగినట్టు విద్యార్థులు చెప్తున్నారు.



### • హెచ్‌సీయూ అష్టదిగ్బంధం

**హెచ్‌సీయూ** క్యాంపస్‌ను పోలీసులు బుధవారం అష్టదిగ్బంధం చేశారు. విశ్వవిద్యాలయం ద్వారాలన్నింటినీ బారికేడ్లతో మూసివేశారు. క్యాంపస్ దరిదాపులకు ఎవ్వరూ వెళ్లకుండా పోలీసు బలగాలను మోహరించారు. ఒక్కో గేటు వద్ద పదుల సంఖ్యలో పోలీసులను మోహరించి లోపలివారు బయటకు, బయటివారు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈస్ట్ క్యాంపస్ వైపు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసి, అటువైపు విద్యార్థులు వెళ్లకుండా కట్టడి చేశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేసేందుకు బయటి నుంచి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎవ్వరూ రాకుండా భారీ బలగాలను మోహరించారు. విద్యార్థులు, యూనివర్సిటీ ఉద్యోగులను మాత్రమే గుర్తింపుకార్డులు చూసి లోపలికి అనుమతించారు. హెచ్‌సీయూను పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. హెచ్‌సీయూ వైపు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద కూడా పోలీసులు మోహరించడంతో ఏం జరుగుతున్నదో తెలియక సాధారణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

### విధ్వంసంపై మౌనమేల రాహుల్?

- **హెచ్‌సీయూ ఘటనపై నటి రిచా చద్దా మండిపాటు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: హెచ్‌సీయూ పరిధిలోని 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేయడంపై బాలీవుడ్ నటి రిచా చద్దా ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఆమె విమర్శలు గుప్పించారు. విద్యార్థులపై లాఠీచార్జి చేయడం, వందలాది మందిని అరెస్టు చేసినప్పటికీ రాహుల్‌గాంధీ మౌనంగా ఉండటాన్ని ఆమె తప్పుబట్టారు. ఈ మేరకు ఓ విద్యార్థులను పోలీసులు వ్యాన్లలోకి ఈడ్చుకెళ్తున్న వీడియోను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'హే..! రాహుల్‌గాంధీ.. మీ వద్ద ప్రేమ చాలా ఎక్కువగా ఉంటుంది కదా. ఆ ప్రేమలో కొంచెమైనా ప్రకృతిపై చూపండి' అని చెబుతూ రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎంవోను ట్యాగ్ చేశారు. 'అర్ధరాత్రి చిమ్మచీకట్లో చెట్లు ఎందుకు నరుకుతున్నారు. చిమ్మచీకట్లో పని చేసేదెవరు? దొంగలే కదా!' అని తీవ్రంగా స్పందించారు. అర్ధరాత్రి చెట్లను నేలమట్టం చేస్తున్న సమయంలో నెమళ్లు, ఇతర పశుపక్ష్యాదుల అరణ్యరోదనను షేర్ చేశారు. అంతేకాదు, ప్రముఖ దక్షిణాది నటులు ఈ ఘటనపై స్పందించాలని ఆమె కోరారు. చిరంజీవి, రామ్‌చరణ్, అల్లు అర్జున్, నాగార్జున, సమంత తదితర నటీనటులు జీవవైవిధ్య పరిరక్షణకు మద్దతుగా నిలవాలని, ఈ పిచ్చి పనిని ఆపాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని విధ్వంసం చేయడం, వాతావరణ మార్పులపై చూపే ప్రభావం గురించి నటి రిచా చద్దాను 'ది టెలిగ్రాఫ్' ప్రశ్నించగా ఆమె స్పందించారు. 'ఇప్పటికే మనం తీవ్రమైన ఉష్ణోగ్రతలను చవిచూస్తున్నాం. పర్యావరణాన్ని విధ్వంసం చేయడమంటే సామూహిక ఆత్మహత్య లాంటిదే' అని వ్యాఖ్యానించారు.




హెచ్‌సీయూ గేటు వద్ద భారీగా చేరి ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు. మీడియాతో మాట్లాడుతున్న యూహెచ్‌టీఏ అధ్యక్షుడు డాక్టర్ భూక్యా

# సెంటు భూమినీ వదులుకోం

- **హెచ్‌సీయూ అధ్యాపకుల పోరుబాట**
- **బుల్డోజర్లు బయటకెళ్లాలని డిమాండ్**
- **వేలాన్ని ఆపుతాం, ప్రకృతిని రక్షిస్తాం**
- **ప్రభుత్వ చర్యలపై విద్యార్థుల ప్రతిజ్ఞ**
- **కేంద్రం జోక్యం చేసుకోవాలని వినతి**
- **నేడు బోధనేతర సిబ్బంది పోరుబాట**

హైదరాబాద్ సిటీబ్యూరో/కొండాపూర్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థుల ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. వర్సిటీ భూములపై కన్నేసిన కాంగ్రెస్ సర్కారును నిలువరించేలా విద్యార్థులు లేవనెత్తిన 'సేవ్ హెచ్‌సీయూ' ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. బయటకు వచ్చి విద్యార్థులు ఉద్యమిస్తుంటే, ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసులు లాఠీచార్జికి దిగుతున్నారు. అయినా విద్యార్థులు తగ్గడం లేదు. పౌరసమాజం నుంచి వస్తున్న మద్దతు, దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రచారానికి యూనివర్సిటీ అధ్యాపకులు కూడా బుధవారం విద్యార్థులు ఉద్యమానికి గొంతు కలిపారు. వర్సిటీ భూముల పరిరక్షణ ఉద్యమబాటలో భాగస్వాములయ్యారు. యూనివర్సిటీ బోధన సిబ్బంది సంఘాల ఆధ్వర్యంలో వారు ఆందోళనలో పాల్గొన్నారు. విద్యార్థుల ఉద్యమానికి మరింత బలాన్నిచ్చేలా అధ్యాపకులు పోరాటంలో మమేకం కావడంతో మరింత ఊపు వచ్చింది. హెచ్‌సీయూ అధ్యాపక సంఘం ఆధ్వర్యంలోనూ ప్రొఫెసర్లు యూనివర్సిటీలో గళమెత్తారు. హెచ్‌సీయూ అడవుల నరికివేతను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నెలరోజుల వ్యవధిలో ఆ భూములను వర్సిటీకి బదిలీ చేయాలని స్పష్టంచేశారు. 400 ఎకరాల్లో ఉన్న అటవీ ప్రాంతం నిర్వీర్యమైపోతున్న నేపథ్యంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ జోక్యం చేసుకోవాలని కోరారు. 2,340 ఎకరాల విస్తీర్ణంలో ఉండే సెంట్రల్ యూనివర్సిటీలో ఇంచు భూమిని కూడా అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు అధ్యాపకులు స్పష్టంచేశారు. అరుదైన వన సంపదను, పక్షి, జంతుజాలాలను కాపాడుకుంటామని విద్యార్థులు, అధ్యాపకులు ప్రతినబూనారు. వర్సిటీ భూములను వదులుకునే ప్రసక్తే లేదని, గురువారం నుంచి బోధనేతర సిబ్బంది విద్యార్థులతో కలిసి ఉద్యమబాట పట్టనున్నది.

**• లాఠీచార్జి చేసే హక్కు ఎవరిచ్చారు?**

యూనివర్సిటీలోకి అక్రమంగా చొరబడి బుల్డోజర్లతో అడవులను తొలగించడమే కాకుండా, అడ్డుకుంటున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసే హక్కు ఎవరిచ్చారు. పోలీసులు ఉన్నచోట మీడియాకు కూడా అనుమతివ్వాలి. అప్పుడే యూనివర్సిటీలో జరుగుతున్న ఘోరాలు బయటి ప్రపంచానికి కనిపిస్తాయి. మా క్యాంపస్‌లోకి మేము వెళ్లేందుకు ఐడీ కార్డులు చూపించాలంటున్నారు. మరి అనుమతులు లేకుండా పోలీసులు ఎందుకొచ్చారు? రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రశ్నించేందుకు విద్యార్థులు వెనుకాడరు. ఇప్పటికైనా పోలీసులు బుల్డోజర్లతో సహా యూనివర్సిటీ నుంచి బయటకు వెళ్లాలి. భూములను వెంటనే యూనివర్సిటీకి అప్పగించి, విద్యార్థులపై పెట్టిన కేసులను తొలగించి, వారిని వెంటనే విడుదల చేయాలి.

**- ప్రజ్ఞ, విద్యార్థిని, హెచ్‌సీయూ**

**• దొంగలమా? టెర్రరిస్టులమా?**

మా యూనివర్సిటీ భూముల పరిరక్షణకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న మాపై పోలీసులు దౌర్జన్యంగా లాఠీచార్జి చేయడమేంటి? మేమేమైనా దొంగలమా? టెర్రరిస్టులమా? క్యాంపస్‌లోకి వందలాది మంది పోలీసులు చేరి అజమాయిషీ చేయడమేంటి? సీఎం రేవంత్‌రెడ్డి క్యాంపస్‌లోకి పోలీసులను, బుల్డోజర్ల పంపి అడవులను తొలగిస్తున్నారు. జీవవైవిధ్యానికి నిలయంగా ఉన్న యూనివర్సిటీని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోం. మా భూములను మాకు అప్పగించి వెళ్లిపోవాలి.

**-శుక్ల, విద్యార్థి, హెచ్‌సీయూ**

**ఇందిరమ్మ ఇచ్చిన భూములను లాక్కోవడం సిగ్గుచేటు**



హెచ్‌సీయూ ఏర్పాటు కోసం నాటి ఇందిరాగాంధీ కేటాయించిన భూములను, ఆమె వారసులుగా చెప్పుకునే రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి లాక్కోవాలనుకోవడం సిగ్గుచేటు. వర్సిటీకి కేటాయించిన భూములను కేవలం అకాడమిక్ సేవలకు మాత్రమే ఉపయోగించాలి. ఎటువంటి కమర్షియల్, వ్యాపార సేవలకు వినియోగించరాదు. ఈ భూముల్లో ఇంటర్నేషనల్ యూనివర్సిటీలు, లా యూనివర్సిటీ, మెడికల్ కాలేజ్, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్లను ఏర్పాటు చేయండి. దానికి యూనివర్సిటీ సహకరిస్తుంది.

**- ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, తెలుగు శాఖ అధ్యక్షుడు, హెచ్‌సీయూ**

### ప్రభుత్వ చర్య.. నిబంధనలకు విరుద్ధం

**నిబంధనలకు** విరుద్ధంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను అమ్ముకునేందుకు యత్నిస్తున్నది. గతంలోనూ వర్సిటీ భూములలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేయగా మా విద్యార్థుల ఆందోళనలతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఇప్పుడు రేవంత్ సర్కార్ వ్యాపారం చేయాలనుకుంటున్నది. ఈ 400 ఎకరాల్లో ఆకుపచ్చని అడవులతోపాటు పెద్ద చెరువులు, అనేక రకాల జంతువులు, పక్షులు, సరీసృపాలు, అనేక ఔషధ మొక్కల జాతులు ఉన్నాయి. ఇప్పటికే నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారింది. ఈ 400 ఎకరాల్లో కమర్షియల్, వ్యాపారకార్యకలాపాలు చేపడితే కాలుష్యం మరింత పెరుగుతుంది. వర్సిటీ భూములను కేవలం అకడమిక్ సేవల కోసమే వినియోగించాలి.

**- డాక్టర్ ధర్మ భూక్యా, అధ్యక్షుడు, హెచ్‌సీయూ టీచర్స్ యూనియన్(యూహెచ్‌టీఏ)**

## హైకోర్టు వద్దన్నా.. లెక్కే లేదు!

మొదటిపేజీ తరువాయి...

కొనసాగిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అన్ని వర్గాల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వం చీకటి పడ్డాక పనులు నిలిపివేయాల్సి వచ్చింది.

గచ్చిబౌలిలో 400 ఎకరాలను టీజీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం గత ఏడాది జూన్ 26న జారీచేసిన జీవో 54ను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కే బాబూరావు, వట ఫౌండేషన్ వేర్వేరుగా దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్ నిరంజన్‌రెడ్డి, ఎల్ రవిచందర్ వాదనలు వినిపిస్తూ, గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు, టీఎన్ గోదావర్మన్ తిరుమల్పాడ్, అశోక్‌కుమార్ శర్మ తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వం జీవో ఇచ్చిందని తప్పుపట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉన్నదని చెప్పారు. ప్రభుత్వం మార్చి 15న కమిటీని ఏర్పాటు చేసినట్టు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. యాభై ఎకరాలు దాటిన ప్రాంతంలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా, అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేయాలన్నా కేంద్రం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధనకు వ్యతిరేకంగా జీవో ఇచ్చిందని చెప్పారు. పర్యావరణ అధ్యయనం చేయాలనే నిబంధనను సైతం ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని తెలిపారు. వాల్టా చట్టం ప్రకారం మూడు అడుగులు పెరిగిన ఒక్క చెట్టును కొట్టాలన్న అధీకృత అధికారి అనుమతి తప్పనిసరిగా పొందాలని అన్నారు. కోర్టులో గత వారం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, మధ్యంతర ఉత్తర్వులపై ప్రభుత్వ వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశిస్తూ విచారణను ఈనెల 7వ తేదీకి వాయిదా వేసిందని, ఈలోగానే, పెద్ద ఎత్తున జేసీబీలు, పొక్లెయినర్లతో అక్కడి ప్రాంతాన్ని ధ్వంసం చేశారని చెప్పారు. తమ పిటిషన్లను కోర్టు అనుమతించేలోగా, ఆ భూములు ధ్వంసం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పుడు మరోచోట అటవీ ప్రాంతం అభివృద్ధి చేస్తామని చెప్పవచ్చునని, ఈ పరిస్థితులను అంచనా వేసి, ఆందోళనకర పరిస్థితులను గమనించి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇది హైదరాబాద్ మహానగరం మధ్యలో పర్యావరణ సమతుల్యతకు ఇది అవసరమని చెప్పారు. ఎన్టీఆర్‌ఎస్ ఫొటోలు సమర్పించాలని, అదేవిధంగా నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారా? కమిటీ ఈ ప్రాంతాన్ని సందర్శించి నివేదిక ఇచ్చిందా? ఎన్ని చెట్లను కూల్చివేశారు? వాటికి అనుమతులు తీసుకున్నారా? తదితర వివరాలను ప్రభుత్వం నుంచి తెప్పించాలని కోరారు.



**ఇది పరిశ్రమల కోసం కేటాయించిన స్థలం: ప్రభుత్వం**

సదరు వివాదాస్పద స్థలాన్ని కేవలం పరిశ్రమల నిమిత్తమే ప్రభుత్వం కేటాయించిందని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదించారు. ఒక్క గూగుల్ మ్యాప్‌లు తప్ప పిటిషనర్లు వేరే ఆధారాలు చూపడం లేదని అన్నారు. రెవెన్యూ, అటవీ, పక్షిజాతులకు సంబంధించిన గణాంకాలకు ఆధారాలు చూపడం లేదని చెప్పారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి బయట వేరే స్థలం ఉన్నదని తెలిపారు. 2006 నుంచే దీనిని పరిశ్రమల స్థలంగా గుర్తించినట్టు తెలిపారు. 2008లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఐఎంజీ భారత అకాడమీకి అప్పగించిందని, ఆమేరకు ఐఎంజీ ఆ భూములను వినియోగించలేదని దీంతో ప్రభుత్వం ఆ కేటాయింపును రద్దు చేసిందని తెలిపారు. వాదనలు పూర్తికాకపోవడంతో ధర్మాసనం విచారణను గురువారానికి వాయిదా వేసింది. అప్పటివరకు కంచ గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.